

- 2009లో పాలకుర్తి, చెన్నూరు రిజర్వాయర్లకు శంకుస్థాపన
- రూ.320 కోట్లతో నిర్మాణ పనులకు శ్రీకారం
- పూర్తయితే 32వేల ఎకరాల ఆయకట్టుకు నీళ్లు
- పాలకులు మారడంతో పనులకు బ్రేక్
- నిర్మాణంలో కనిపించని నాణ్యత ప్రమాణాలు
- ఎమ్మెల్యే దృష్టిసారించాలంటున్న అన్నదాతలు

పదిహేనేళ్లయినా.. పూర్తికాలే..!



చెన్నూరు రిజర్వాయర్ కట్టకు రివిట్‌మెంట్ చేయకుండా వదిలేసిన దృశ్యం

పది హేనేళ్ల క్రితం కాంగ్రెస్ హయాంలో ప్రారంభించిన పాలకుర్తి, చెన్నూరు రిజర్వాయర్ల పనులు ఇంతవరకు పూర్తి కాలేదు. మధ్యలో పాలకులు మారడంతో పనులు నత్తనడకన సాగుతున్నాయి. దీనికి తోడు నిధుల విడుదలలో జాప్యం, అధికారుల నిర్లక్ష్యం మూలంగా ఒక అడుగు ముందుకు.. రెండడుగులు వెనక్కి అన్న చందంగా ఊగిసలాడుతున్నాయి. ఇపుడు మళ్లీ కాంగ్రెస్ ప్రభుత్వం ఏర్పడినందున రైతుల్లో ఆశలు చిగురిస్తున్నాయి. ఎమ్మెల్యే యశస్విని రెడ్డి చొరవ చూపాలని, పనులు పూర్తిచేయించి సాగునీరందించాలని ఈ ప్రాంత రైతులు వేడుకుంటున్నారు.

పాలకుర్తి, ఏప్రిల్ 5: గోదావరి జలాలతో పాలకుర్తి ప్రాంతాన్ని సస్యశ్యామలం చేసేందుకు కాంగ్రెస్ హయాంలో ప్రణాళిక రచించారు. పాలకుర్తి, చెన్నూరు ఊర చెరువులను బ్యాలెన్సింగ్ రిజర్వాయర్లుగా మార్చాలని నిర్ణయించి నిధులు కేటాయించారు. 2009లో అప్పటి మంత్రి పొన్నాల లక్ష్మయ్య పాలకుర్తి చెరువు వద్ద శంకుస్థాపన చేశారు. పాలకుర్తి రిజర్వాయర్ 0.25 టీఎంసీ, చెన్నూరు రిజర్వాయర్ 0.5 టీఎంసీ కెపాసిటీతో నిర్మాణానికి శ్రీకారం చుట్టారు. పాలకుర్తి, చెన్నూరు రిజర్వాయర్లకు మొదటి విడత రూ. 320 కోట్లు నిధులు విడుదల చేశారు. ఆ తర్వాత వ్యయాన్ని రూ. 370 కోట్లకు పెంచారు. పాలకుర్తి రిజర్వాయర్ ఆయకట్టు 7,515 ఉండగా, చెన్నూరు రిజర్వాయర్ ఆయకట్టు 25,165 ఎకరాలుగా నిర్ణయించారు. ఈ రెండు రిజర్వాయర్ల కోసం 2,961 ఎకరాల భూమిని సేకరించాల్సి ఉండగా, ఇప్పటి వరకు 2,289 ఎకరాలు సేకరించారు. ఇంకా 670 ఎకరాల భూమిని సేకరించాల్సి ఉంది. అయితే ఉమ్మడి రాష్ట్రంలో రాజకీయ కారణాలతో ఈ పనులు ముందుకు సాగలేదు. తర్వాత మాజీ మంత్రి ఎర్రబెల్లి దయాకర్‌రావు చొరవతో 12 ఏళ్ల క్రితం చెన్నూరు రిజర్వాయర్ పనులు ప్రారంభించారు. అయినా నేటికి 50 శాతం పనులు మాత్రమే పూర్తయ్యాయి. ఆ తర్వాత మూడేళ్ల క్రితం పాలకుర్తి రిజర్వాయర్ పనులు ప్రారంభించినా నత్త నడకన సాగుతున్నాయి. ఈ రిజర్వాయర్ పనులు పూర్తయితే యేటా కనీసం రెండు పంటలు పండుతాయని రైతులు ఆశించారు. కానీ పనుల్లో జాప్యం జరుగుతుండటంతో రైతులు అసహనం వ్యక్తం చేస్తున్నారు. కాంట్రాక్టర్‌కు ప్రభుత్వం నుంచి బిల్లులు రాకపోవడమే జాప్యానికి కారణమని అధికారులు చెబుతున్నారు.

ఇసుకకు బదులు డస్టు..

చెన్నూరు రిజర్వాయర్ పనుల్లో కాంట్రాక్టర్ ఇసుకకు బదులు రాతి పొడి (డస్ట్)ను వినియోగిస్తున్నారని ఆరోపణలు వస్తున్నాయి. మొదట పనులు చేపట్టిన కాంట్రాక్టర్ నిర్లక్ష్యంగా వ్యవహరించడంతో అప్పటి మంత్రి దయాకర్‌రావు అతడిని తొలగించి మరో కాంట్రాక్టర్‌కు పనులను అప్పగించారు. అయినప్పటికీ ఫలితం కనిపించడం లేదు. ఇప్పటి వరకు 50 శాతం పనులు మాత్రమే జరిగాయి. అదే విధంగా కాల్వలను తవ్వి వదిలేసి ఏడాది గడిచినా ఎక్కడ గొంగళి అక్కడే అన్న చందంగా తయారయ్యాయి.

ఎమ్మెల్యే యశస్విని సమీక్షించినా..

స్థానిక ఎమ్మెల్యే మామిడాల యశస్వినిరెడ్డి గత నెలలో వరంగల్‌తో పాటు తొర్రూరులో పలుమార్లు సంబంధిత శాఖ అధికారులతో సమీక్షించారు. రిజర్వాయర్ పనుల్లో వేగం పెంచాలని ఆదేశించారు. ఈ ప్రాంత రైతాంగానికి సాగునీరు అందించేలా చర్యలు తీసుకోవాలని సూచిం చారు. కాగా, భాగంగా చెరువు కట్ట నుంచి ఆర్‌అండ్‌బీ రోడ్డు వరకు కట్ట పనులు కొంత మేరకు పూర్తయ్యా యని, మరోవైపు భూములు కోల్పోయిన రైతులకు ఇప్పటి వరకు 724 ఎకరాలకు మాత్రమే నష్టపరిహా రం అందిందని, మిగతావారికి అందించాల్సి ఉందని అధికారులు ఎమ్మెల్యే దృష్టికి తీసుకెళ్లారు. అంతేగా కుండా ఈ రెండు రిజర్వాయర్ల పనులు పూర్తి కావాలంటే ఇంకా రూ. 200 కోట్లు కావాలని తెలియజేశారు. కాగా, ఈ విషయాన్ని ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్తానని ఎమ్మెల్యే స్పష్టం చేశారు.

పనుల్లో వేగం పెంచుతాం..
- శ్రీకాంత్ శర్మ, డీఈఈ పాలకుర్తి



చెన్నూరు, పాలకుర్తి రిజర్వాయర్ల పనులు కొనసాగుతున్నాయి. ఇంకా వేగంగా పూర్తి చేసేలా చర్యలు తీసుకుంటాం. పాలకుర్తి కట్ట నిర్మాణం మొత్తం 3.45 కిలో మీటర్లు చేయాల్సి ఉండగా, 2.3 కిలో మీటర్ల మేర పూర్తయింది. మిగతా పనులు చేయాల్సి ఉంది. చెన్నూరు రిజర్వాయర్ ఏడు కిలో మీటర్ల మేర మెయిన్ కెనాల్ పనులు పూర్తయ్యాయి. రివిట్‌మెంట్ పనులు చేయాల్సి ఉంది. ఇసుక అందుబాటులో లేకపోవడంతో డస్టుతో పని చేయాల్సి వస్తోంది.





పాలకుర్తిలో ఆర్‌అండ్‌బీ రోడ్డు వరకు నిర్మించిన కట్ట, పాలకుర్తిలో వేసిన శిలాఫలకం, చెన్నూరులో ఇసుకకు బదులు వాడుతున్న డస్టు



రంజాన్ వేళలు

ఇఫ్తార్ :	శనివారం	సా : 6.36 గం.
సహర్ :	ఆదివారం	ఉ : 4.43 గం.

విజ్ఞానం.. వినోదం..

- నిట్‌లో కన్నుల పండువగా స్ప్రింగ్ స్ప్రీ వేడుకలు ప్రారంభం
- వసంతోత్సవ సంబురంతో క్యాంపస్‌లో సందడి సందడి
- మొదలైన వివిధ ఈవెంట్లు.. ఉత్సాహంగా పాల్గొన్న విద్యార్థులు
- మూడు రోజులపాటు పలు సాంస్కృతిక ప్రదర్శనలు



మాట్లాడుతున్న నిట్ డైరెక్టర్ ప్రొఫెసర్ విద్యాధర్ సుబుధి

వివరాలు 5వ పేజీలో...

దేవరుప్పులలో బీఎస్ఎన్ఎల్ 'హైస్పీడ్' సేవలు

దేవరుప్పుల, ఏప్రిల్ 5: ప్రభుత్వ రంగసంస్థ అయన బీఎస్ఎన్ఎల్ ద్వారా ఇక నుంచి దేవరుప్పుల పరిసర గ్రామాల ప్రజలకు ఆప్టికల్ ఫైబర్ ద్వారా హైస్పీడ్ ఇంటర్‌నెట్ సేవలు అందిస్తామని ఆ సంస్థ జనగామ సబ్ డివిజనల్ ఇంజనీర్ చంద్రగిరి ప్రసాద్ తెలిపారు. నూతనంగా దేవరుప్పులలో భారత్‌సాయి, కడవెండిలో శ్రీకాంత్ కేబుల్ టీవీ ద్వారా ఓఎల్‌టీలు ఏర్పాటు చేశామని, తద్వారా కస్టమర్లకు హైస్పీడ్ బ్రౌజింగ్, ఆన్‌లైన్ లావాదేవీలకు హైసెక్యూరిటీ ఇంటర్నెట్ ఉంటుందన్నారు. అంతే కాకుండా లాండ్‌లైన్ ఫోన్ నుంచి ఉచితంగా అపరిమిత కాల్స్‌చేసుకోవచ్చన్నారు. మరిన్ని వివరాలకు 94901 24838నెంబరులో సంప్రదించవచ్చని ఆయన సూచించారు.

ప్రత్యర్థులు ఒక్కటయ్యారు..

రేవూరితో కలిసి ఇందిర ఇంటికి వెళ్లిన కడియం
ఎన్నికల సమయంలో పోటీపడిన ఇద్దరు..
నాడు ఇందిరపై పోలీస్‌స్టేషన్‌లో ఫిర్యాదు చేసిన కడియం



కడియం శ్రీహరి, కావ్య, రేవూరి ప్రకాశ్‌రెడ్డిని సన్మానిస్తున్న ఇందిర

స్టేషన్‌ఘన్‌పూర్, ఏప్రిల్ 5: నిన్న మొన్నటి వరకు ప్రత్యర్థులుగా ఉన్న ఎమ్మెల్యే కడియం, టీపీసీసీ రాష్ట్ర ప్రధానకార్యదర్శి సింగపురం ఇందిర నేడు ఒకే గొడుగు కిందకు చేరారు. గురువారం రాత్రి ఎమ్మెల్యే రేవూరి ప్రకాశ్ రెడ్డి ఆధ్వర్యంలో ఎమ్మెల్యే కడియం శ్రీహరి, ఆయన కూతురు కడియం కావ్య హైదరాబాద్‌లోని సింగపురం ఇందిర ఇంటికి వెళ్లారు. ఇందిర వారికి స్వాగతం పలికి శాలువాలు కప్పి సత్కరించారు. వాస్తవానికి కడియంతో పాటు ఆయన కుమార్తె కాంగ్రెస్‌లో చేరుతున్నారనే ప్రకటన వెలుబడినప్పటి నుంచి ఇందిర ఆదేశాల మేరకు కాంగ్రెస్ పార్టీ నాయకులు సమావేశాలు నిర్వహించి కడియంను కాంగ్రెస్‌లోకి తీసుకోవద్దు అంటూ అడ్డుకునే ప్రయత్నం చేశారు. ఈ విషయంలో పునరాలోచించాలని పార్టీ అధిష్ఠానానికి నివేదించారు. అంతకుముందు ఎన్నికల సమయంలో ఇద్దరి మధ్య మాటల యుద్ధం తారస్థాయికి వెళ్లింది. కడియం ఇందిరపై వ్యక్తిగత విమర్శలు చేయడం, ప్రతిగా ఆమె ఎన్‌కౌంటర్ల సృష్టికర్త అని కడియంను ఆరోపించడం వరకు వెళ్లారు. దీంతో ఇందిరపై గత నవంబరు 24న కడియం పోలీసులతో పాటు ఎన్నికల అధికారికి ఫిర్యాదు చేశారు. ఇద్దరి మధ్య ఇంత వైరుధ్యం ఉన్న తరుణంలో కడియం కాంగ్రెస్‌లోకి వెళ్లడం, ఇందిర వారికి మద్దతు తెలపడం, వరంగల్ ఎంపీగా కడియం కావ్యను గెలిపించడానికి సిద్ధపడడం చకచకా జరిగిపోయాయి. దీంతో ఒక వర్గం ప్రజలు ఆశ్చర్యం వ్యక్తం చేస్తుండగా.. రాజకీయాల్లో ఇవన్నీ మామూలేనని కొందరు కొట్టిపారేస్తున్నారు. మొత్తంగా కడియం కాంగ్రెస్‌లో చేరడంతో ఘన్‌పూర్‌లో ప్రతిపక్షం లేకుండా పోయిందని ప్రజల్లో చర్చ నడుస్తోంది.

మాజీ ఉప ప్రధానికి జన నివాళి



జనగామలో బాబూ జగ్జీవన్ రామ్ విగ్రహానికి పూలమాల వేస్తున్న కలెక్టర్ రిజ్వాన్ బాషా

జనగామ కల్చరల్, ఏప్రిల్ 5: భారత మాజీ ఉప ప్రధాని బాబూ జగ్జీవన్ రామ్ 116వ జయంతిని పురస్కరించుకొని జిల్లా వ్యాప్తంగా ఆయనకు ఘన నివాళులర్పించారు. శుక్రవారం జిల్లా కేంద్రంలోని ఆర్ అండ్‌బి గెస్ట్‌హౌస్ వద్ద గల బాబూ జగ్జీవన్‌రామ్ విగ్రహానికి కలెక్టర్ షేక్ రిజ్వాన్ బాషా, అదనపు కలెక్టర్లు పింకేశ్‌కుమార్, రోహిత్ సింగ్ పూలమాల వేసి నివాళులర్పించారు. కార్యక్రమంలో జిల్లా అధికారులు దయానందరాణి, బీసీ వెల్ఫేర్ అధికారి రవీందర్, మునిసిపల్ కమిషనర్ వెంకటేశ్వర్లు తదితరులు పాల్గొన్నారు.

రైతులను మోసగిస్తున్న కాంగ్రెస్

బీజేపీ రాష్ట్ర ఉపాధ్యక్షుడు గంగిడి మనోహర్‌రెడ్డి



జనగామలో మాట్లాడుతున్న గంగిడి మనోహర్‌రెడ్డి


జనగామ, ఏప్రిల్ 5 (ఆంధ్రజ్యోతి): ఎన్నికల సమయంలో రైతులకు ఇచ్చిన హామీలను నెరవేర్చకుండా కాంగ్రెస్ పార్టీ మోసం చేస్తోందని బీజేపీ రాష్ట్ర ఉపాధ్యక్షుడు గంగిడి మనోహర్‌రెడ్డి, జిల్లా అధ్యక్షుడు ఆరుట్ల దశమంత్‌రెడ్డి విమర్శించారు. కాంగ్రెస్ పార్టీ ఆరు గ్యారెంటీల అమలులో విఫలమైందని నిరసిస్తూ జిల్లాకేంద్రంలో రైతు సత్యాగ్రహం కార్యక్రమాన్ని చేపట్టారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. తమది రైతు ప్రభుత్వం అంటూ రేవంత్‌రెడ్డి గొప్పలు చెప్పుకుంటున్నారని, అధికారంలోకి రాగానే డిసెంబరు 9న రూ.2 లక్షల రుణమాఫీ చేస్తానని, రైతుభరోసా అమలు చేస్తానని చెప్పి కాలయాపన చేస్తున్నారని మండిపడ్డారు. రేవంత్‌రెడ్డి ప్రభుత్వానికి డిసెంబర్ 9 ఇంకా రాలేదా అని ఎద్దేవా చేశారు. వంద రోజుల పాలన అద్భుతమంటూ ప్రకటనలు ఇచ్చుకోవడం తప్ప రేవంత్‌రెడ్డి చేసిందేమీ లేదని విమర్శించారు. రైతుబంధు పేరుతో గతంలో కేసీఆర్ మోసం చేయగా రైతుభరోసా పేరుతో రేవంత్‌రెడ్డి మోసం చేస్తున్నారన్నారు. రాష్ట్రంలో ఇప్పటి వరకు ఎంత మందికి రైతుబంధు ఇచ్చిందో ప్రభుత్వం చెప్పాలని డిమాండ్ చేశారు. కేసీఆర్ పంటల పరిశీలనకు కేవలం ఫొటోషూట్ కోసమే వచ్చారని ఎద్దేవా చేశారు. గతంలో కేసీఆర్ అధికారంలో ఉన్నప్పుడు పంటలకు ఎంత నష్టపరిహారం ఇచ్చారో ఆలోచించుకోవాలన్నారు. మాయమాటలతో అధికారంలోకి వచ్చిన కాంగ్రెస్ పార్టీకి లోక్‌సభ ఎన్నికల్లో ప్రజలు తగిన గుణపాఠం చెబుతారని అన్నారు. సమావేశంలో బీజేపీ నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

'కాంగ్రెస్ మాదిగలకు అన్యాయం చేసింది'

లింగాలఘణపురం, ఏప్రిల్5: లోకసభ టికెట్ల కేటాయింపుల్లో కాంగ్రెస్ పార్టీ మాదిగలకు అన్యాయం చేసిందని ఆరోపిస్తూ శుక్రవారం లింగాలఘణపురం మండలం నెల్లుట్లలో ఎంఆర్‌పీఎస్ నాయకులు సీఎం రేవంత్‌రెడ్డి దిష్టిబొమ్మను దహనం చేశారు. ఈసందర్భంగా ఎంఆర్‌పీఎస్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి రాగల్ల ఉపేందర్ మాదిగ మాట్లాడుతూ మాదిగల ప్రోద్బలంతోనే ఎదిగానని ప్రగల్భాలు పలికిన సీఎం రేవంత్‌రెడ్డి ఎంపీ టికెట్ల కేటాయింపుల్లో మాదిగలకు తీవ్రంగా అన్యాయం చేస్తూ అణచివేతకు గురిచేస్తున్నారని ఆగ్రహం వ్యక్తం చేశారు. అనంతరం జనగామ-సూర్యాపేట జాతీయ రహదారిపై రాస్తారోకో చేశారు. కార్యక్రమంలో ఎంఆర్‌పీఎస్ నాయకులు నర్సింగ రవి, సందెన రవీందర్, నల్ల లాజర్, సందెన రవీందర్, ఉపేందర్, స్వామి, యాదగిరి, కుమార్, అంజయ్య, సతీష్, చంద్రయ్య తదితరులు పాల్గొన్నారు.



నెల్లుట్లలో సీఎం దిష్టిబొమ్మను దహనం చేస్తున్న ఎంఆర్‌పీఎస్ నాయకులు



నేడే బ్రహ్మాండమైన విడుదల



దేశంలో నిరుద్యోగం పెరుగుతోంది..

- ఉన్నత విద్యలో డ్రాపౌట్స్ పెరుగుతున్నాయి
- రాష్ట్ర హైకోర్టు రిటైర్డు చీఫ్ జస్టిస్ చంద్రకుమార్
- కేయూలో ఘనంగా బాబు జగ్జీవన్‌రాం జయంతి వేడుకలు


మాట్లాడుతున్న జస్టిస్ చంద్రకుమార్

కేయూ క్యాంపస్, ఏప్రిల్ 5 : దేశంలో నిరుద్యోగం తీవ్రస్థాయిలో పెరుగుతోందని రిటైర్డు హైకోర్టు జడ్జీ జస్టిస్ బి.చంద్రకుమార్ ఆందోళన వ్యక్తం చేశారు. శుక్రవారం హనుమకొండ కేయూలో బాబు జగ్జీవన్‌రాం జయంతిని పురస్కరించుకుని ఎస్డీఎల్‌సీఈ సమిపంలోని బాబు జగ్జీవన్‌రాం చిత్రపటానికి చంద్రకుమార్‌తోపాటు కేయూ వీసీ రమేశ్ ఇతర అధికారులు పూల మాలవేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా కేయూ ఎస్సీ, ఎస్టీ సెల్ డైరెక్టర్ రాజమణి అధ్యక్షతన ఏర్పాటు జయంతిని నిర్వహించారు. ఇందులో భాగంగా 'కాంటెంపరరీ ఇష్యూష్ ఆఫ్ ఇండియన్ సొసైటీ' అనే అంశంపై జస్టిస్ బి.చంద్రకుమార్ హాజరై కీలక ప్రసంగం చేశారు. దేశంలో పట్టణ, గ్రామీణ ప్రాంతాల్లో నిరుద్యోగం పెరుగుతోందని ఆందోళన వ్యక్తం చేశారు. యువత, విద్యార్థులలో డ్రాపౌట్స్ పెరుగుతున్నాయని చెప్పారు. జీవన సౌకర్యాలకు, ప్రమాణాలకు స్థూల, దేశీయ ఉత్పత్తి, తలసరి ఆదాయ గణాంకలలో పొంతనలేదన్నారు. దేశంలో పేదరికం ఎక్కువవుతోందన్నారు. రూ.80 లక్షల కోట్లనల్లధనం ఉందన్నరని, కొద్దిమంది చేతుల్లోనే సంపద కేంద్రీకృతం అవుతోందని చెప్పారు. ప్రాజెక్టు అంచనాలను పెంచి ప్రజల సొమ్మును దోచుకుకుంటున్నారని చెప్పారు.

ముఖ్యఅతిథిగా హాజరైన వీసీ తాటికొండ రమేశ్ మాట్లాడుతూ గొప్ప మార్గదర్శి, సమతాస్ఫూర్తి బాబు జగ్జీవన్‌రాం ఆశయాల సాధనకు అందరూ పాటుపడాలని పిలుపునిచ్చారు. ప్రజాస్వామ్యాన్ని కాపాడటంతో యువత ముందుండాలని చెప్పారు. విద్యతోనే మార్పు సాధ్యమన్నారు. గౌరవ అతిథిగా పాల్గొన్న కేయూ రిజిస్ట్రార్ ప్రొఫెసర్ పి.మల్లారెడ్డి మాట్లాడుతూ గొప్ప విలువలున్న మానవతామూర్తి జగ్జీవన్‌రాం అని కొనియాడారు. సభకు అధ్యక్షత వహించిన తుమ్మల రాజమణి మాట్లాడుతూ బాబు జగ్జీవన్‌రాంను ఆదర్శంగా తీసుకుని, యువత ఎదగాలని చెప్పారు. ఇంజనీరింగ్ కళాశా కాంట్రాక్టు అధ్యాపకురాలు లక్ష్మి సభకు స్వాగతం పలుకగా, పీఆర్‌వో వల్లాల పృథ్వీరాజ్ వందన సమర్పణ చేశారు. చరిత్రఅండ్ టూరిజం ఫ్యాకల్టీ చిలువేరు రాజ్‌కుమార్ జస్టిస్ చంద్రకుమార్‌ను సభకు పరిచయం చేశారు. కార్యక్రమంలో ఎస్డీఎల్‌సీఈ డైరెక్టర్ ప్రొఫెసర్ వల్లూరి రామచంద్రం, పరీక్షల నియంత్రణాధికారి ప్రొఫెసర్ శ్రీరామోజు నరసింహచారి, ప్రొఫెసర్ కె.వాసుదేవారెడ్డి, దూరవిద్య కేంద్రం ఎస్సీ,ఎస్టీ ఉద్యోగుల సంఘం అధ్యక్షుడు కొట్టే భాస్కర్, పాలమాకుల కొమురయ్య, బైరపాక ప్రశాంత్, పెండ్లి అశోక్‌బాబు, సుదయ్య, శ్రీధర్‌కుమార్ లోథ్, ప్రణయ్‌కుమార్, వెంకటేశ్, మాచర్ల ఐలేశ్, వంగాల సుధాకర్ పాల్గొన్నారు.

కొత్త బస్టాండ్ పనులు షురూ

- వరంగల్‌లో ఆర్టీసీ పాత భవనాల కూల్చివేత



మూసివేసిన పాత బస్‌స్టేషన్

గిర్మాజీపేట, ఏప్రిల్ 5 : నాలుగు దశాబ్దాలుగా ఉమ్మడి వరంగల్ జిల్లా ప్రజలకు సేవలు అందించిన వరంగల్ ఆర్టీసీ బస్‌స్టేషన్ ఇక కనుమరుగు కానుంది. మొండిగోడలు, పరిశుభ్రంలేని టాయిలెట్లు, ప్రయాణికులకు భద్రతలేని శిథిలావస్థకు చేరుకున్న బస్‌స్టేషన్ స్థానంలో అధునాతన మల్టీలెవెల్ బస్‌స్టేషన్ నిర్మాణానికి పనులు శుక్రవారం నుంచి పనులు మొదలయ్యాయి. రైల్వేస్టేషన్‌కు ఎదురుగా నాటి ప్రధాని దివంగత పీవీ నరసింహరావు 1986 డిసెంబరు 21న అప్పటి ఆంధ్రప్రదేశ్ ముఖ్యమంత్రి దివంగత ఎన్‌టిరామారావు ప్రారంభించారు. సిటీ, జిల్లా బస్‌స్టేషన్‌లతో కూడిన ఈ బస్‌స్టేషన్ నుంచి నిత్యం 600 ఆర్టీసీ బస్సుల్లో సుమారు 50వేల మంది ప్రయాణికులు రాకపోకలు సాగిస్తున్నారు. పెరుగుతున్న రద్దీకి అనుగుణంగా గత ప్రభు త్వం రూ.75కోట్ల 'కుడా' నిధులతో నూతన బస్‌స్టేషన్ నిర్మాణానికి శంకుస్థాపన చేసింది. గత జూన్ 17న అప్పటి మున్సిపల్ పట్టణాభివృద్ధి శాఖ మం త్రి కేటీఆర్ శిలాఫలకం వేయగా, ఎన్నికల షెడ్యూల్ విడుదలకు కొద్దిగంటల ముందు అప్పటి తూర్పు ఎమ్మెల్యే నన్నపునేని నరేందర్ అక్టోబరు 9న పనులు ప్రారంభించారు. తర్వాత ఎన్నికలు రావడం, ప్రభుత్వం మారడం, ఈ ఏడాది జరిగిన సమ్మక్క సారలమ్మ జాతర నేపథ్యంలో బస్‌స్టేషన్ నిర్మా ణం పనులు మొదలు కాలేదు. తాజాగా దేవాదాయ, అటవీ, పర్యావరణశాఖల మంత్రి కొండా సురేఖ నిర్మాణ పనులు మొదలు పెట్టాలని చెప్పడంతో 'కుడా' అధికారులు పనులు తిరిగి ప్రారంభించారు. ఏడు అంతస్థుల్లో అధునాతన బస్‌స్టేషన్‌లో 32 బస్ ప్లాట్‌ఫారాలు, మల్టీప్లెక్స్, రెస్టారెంటు,కమర్షియల్ కాంప్లెక్‌లు నిర్మించనున్నారు.


రాకపోకల నిలిపివేత..

కొత్త బస్టాండ్ నిర్మాణం కోసం శుక్రవారం అధికారులు పనులు చేపట్టారు. ఇందులో భాగంగా బస్టాండ్ మీదుగా వాహనాల రాకపోకలను తాత్కాలికంగా నిలిపివేశారు. అలాగే ఎస్ఎన్ఎం క్లబ్‌కు ఎదురుగా రైల్వే ప్రహారికి ఆనుకుని తాత్కాలిక బస్‌స్టేషన్ నుంచి ప్రస్తుతం బస్‌ల రాకపోకలు యథాతథంగా సాగనున్నాయి. శుక్రవారం పాత బస్‌స్టేషన్‌ను పూర్తిగా మూసివేశారు. లోనికి ఎవరూ వెళ్లకుండా పెద్దతాళ్లు కట్టారు. ఖాళీ చేసిన గదుల నుంచి ఇనుప సామగ్రి, డోర్లు, కిటికిలు, పైపుల తొలగింపును ముమ్మరం చేశారు. ఎక్స్‌కవేటర్‌తో ట్యాక్సీ స్టాండ్ ప్రాంతంలో గోతులు తీస్తున్నారు.


మూసివేసిన బస్‌స్టేషన్ చుట్టూ ఏర్పాటు చేసిన బారికేడ్‌లు









ప్రతిజ్ఞ చేపిస్తున్న ప్రొఫెసర్లు

సాంకేతిక వైద్యవిద్య వైపుగా పరుగు పెట్టాలి

- ప్రముఖ కార్డియాలజిస్ట్ కస్తూరి శ్రీధర్
- కేఎంసీలో ఘనంగా పట్టాల ప్రధానోత్సవం

వరంగల్ మెడికల్, ఏప్రిల్ 5 : కాకతీయ మెడికల్ కళాశాలలో విద్యను అభ్యసించిన పూర్వవిద్యార్థులు ప్రస్తుతం మన దేశంలోనే కాకుండా, విదేశాల్లోనూ ఉన్నత వైద్యులుగా రాణిస్తున్నారని కేఎంసీ పూర్వవిద్యార్థి, ప్రముఖ కార్డియాలజిస్ట్ కస్తూరి శ్రీధర్ తెలిపారు. అలాగే సాం కేతిక వైద్యవిద్య వైపుగా పరుగులు పెట్టాలని సూచించారు. శుక్రవారం కేఎంసీ కళాశాల మైదాన ప్రాంగణంలో వైద్యవిద్యను పూర్తి చేసిన విద్యార్థుల పట్టాల ప్రధానోత్సవం కార్యక్రమాన్ని ఘనంగా నిర్వహించారు. దీనికి ముఖ్యఅతిథిగా ఆయన హాజరై మాట్లాడారు. వైద్య వృత్తిలో మానవత్వాన్ని విస్మరించవద్దని కోరారు. కార్యక్రమంలో కేఎంసీ ప్రిన్సిపాల్ డాక్టర్ మోహన్ దాస్, వైస్‌ప్రిన్సిపాల్ డాక్టర్ రాంకుమార్‌రెడ్డి, ఎంజీఎం సూపరింటెండెంట్ డాక్టర్ చంద్రశేఖర్, ప్రొఫెసర్లు డాక్టర్ కవిత, డాక్టర్ హనుమంతరావు, డాక్టర్ భరత్ తదితరులు పాల్గొన్నారు. కాగా, పట్టాల ప్రధానోత్సవ కార్యక్రమంలో కళాశాల మైదానంలో కోలాహాలం నెలకొంది. విద్యార్థుల తల్లిదండ్రులు, బంధుమిత్రులు వేడుకల్లో పెద్ద ఎత్తున తరలి వచ్చారు. దీంతో వైద్యవిద్యను పూర్తి చేసుకుని పట్టాలు అందుకున్న నేపథ్యంలో విద్యార్థులు వారి బంధువులతో సెల్ఫీలు దిగుతూ సందడి చేశారు.



కుటుంబసభ్యులతో పట్టా అందుకున్న ఆనందాన్ని పంచుకుంటున్న వైద్య విద్యార్థి

గైనిక్‌లో పీజీ చేస్తా

- డాక్టర్ సాయిశ్రీభవ్య

తల్లిదండ్రులు, సోదరుడి సహకారంతో ఎంబీబీఎస్ పూర్తి చేశా. ఎమ్మెస్ గైనిక్ పూర్తి చేయాలని ఉంది. వైద్యవృత్తిలో పేదలకు సేవ అందించాలని ఉంది. తల్లిదండ్రుల ఆకాంక్షను నెరవేరుస్తా. పట్టా పొందడం ఆనందంగా ఉంది. అమ్మానాన్న కళ్లల్లో ఆనందం నాకు కనిపించింది.



మేళా ఈవెంట్‌లో ఆటలు ఆడుతున్న విద్యార్థులు



కరౌకీ ఈవెంట్‌లో పాటలు పాడుతున్న విద్యార్థులు



కూచిపూడి నృత్యాన్ని ప్రదర్శిస్తున్న విద్యార్థులు

విజ్ఞానం.. వినోదం..

నిట్‌లో కన్నుల పండువగా స్ప్రింగ్ స్ప్రీ ప్రారంభం

- వసంతోత్సవ సంబురంతో సందడిగా క్యాంపస్
- మొదలైన వివిధ ఈవెంట్లు.. ఉత్సాహంగా పాల్గొన్న విద్యార్థులు
- మూడు రోజులపాటు పలు సాంస్కృతిక ప్రదర్శనలు
- ఆకట్టుకున్న చౌరస్తా, హరిచరణ్ బ్యాండ్

హనుమకొండ (ఆంధ్రజ్యోతి)/ వరంగల్ ఎడ్యుకేషన్, ఏప్రిల్ 5 : విజ్ఞానం, వినోదం కలగలిసిన స్ప్రింగ్ స్ప్రీ-2024 (వసంతోత్సవం) వేడుకలతో కాజీపేటలోని నిట్‌లో కోలాహలం నెలకొంది. శుక్రవారం ప్రారంభమైన ఈ వేడుకకు వివిధ ప్రాంతాల నుంచి తరలొచ్చిన విద్యార్థులతో క్యాంపస్ సందడిగా మారింది. ప్రతి ఏటా ఏప్రిల్ 5, 6, 7 తేదీల్లో మూడు రోజులపాటు జరిగే ఈ వేడుకల్లో వరంగల్ నిట్‌తో పాటు దేశవ్యాప్తంగా ఉన్న 40 ఇంజనీరింగ్ కళాశాలలకు చెందిన సుమారు 10 వేలమంది విద్యార్థులు పాల్గొంటున్నారు. విద్యార్థులకు ప్రతిభకు సానబట్టడంతో పాటు వారిలో దాగిఉన్న శక్తి సామర్థ్యాలు, సృజనాత్మకతను తట్టిలేపే 50కిపైగా ఈవెంట్లను ఇక్కడ నిర్వహిస్తున్నారు. గతంలో కన్నా ఈసారి సరికొత్తవి ప్రవేశపెట్టారు. విజ్ఞానం, వినోదం కలగలిసిన ఈ ఈవెంట్లలో పాల్గొని తమ ప్రతిభా పాటవాలను ప్రదర్శించేందుకు విద్యార్థులు ఉత్సాహం చూపుతున్నారు. స్ప్రింగ్ స్ప్రీ మొదటి రోజు శుక్రవారం సాయంత్రం 3 గంటల నుంచే ఈవెంట్లు ప్రారంభమయ్యాయి. తొలిరోజు 17 ఈవెంట్లను నిర్వహించారు. ఉదయం నుంచే విద్యార్థులు నిట్‌కు చేరుకున్నారు. మధ్యాహ్నం వరకే అయిదువేల మందికిపైగా విద్యార్థులు తమ పేర్లను రిజిస్ట్రేషన్ చేయించుకున్నారు. శని, ఆదివారాల్లో కూడా రెండురోజులు రిజిస్ట్రేషన్లు జరిగి మూడు రోజుల్లో మొత్తంగా పదివేల మంది విద్యార్థులు హాజరుకానున్నట్టు స్ప్రింగ్ స్ప్రీ నిర్వాహకులు తెలిపారు. రాత్రి నిట్ స్టేడియంలో నిర్వహించిన కొరియోనైట్ పాప్‌షో విద్యార్థులను ఉర్రూతలూగించింది. మ్యూజిక్ అనుగుణంగా విద్యార్థులు చిందులేశారు. చౌరస్తా, హరిచరణ్ బ్యాండ్ షోలు ప్రత్యేక ఆకర్షణగా నిలిచాయి.

అంబరాన్నంటిన సాంస్కృతిక సంబరం

నిట్‌లో స్ప్రింగ్ స్ప్రీ సాంస్కృతిక సంబరాలు అంబరాన్నంటాయి. శుక్రవారం మొదటిరోజే టెక్నోక్రాట్స్ అద్భుతమైన ప్రదర్శనలతో ఆకట్టుకున్నారు. నిత్యం సాంకేతిక రంగంతో కుస్తీ పడుతున్న భావి భారత ఇంజనీర్లు వారిలోని సృజనాత్మక సాంస్కృతికతను బహిష్కృతం చేస్తున్నారు. సాంస్కృతికానికి సాంకేతికతను అద్దుతూ ఉత్సాహవంతమైన ఈవెంట్లను ప్రదర్శించారు. కాగా, నిట్‌లో స్ప్రింగ్ స్ప్రీ-2024ను నిట్ డైరెక్టర్ ప్రొఫెసర్ బిద్యాధర్ సుబుద్ధి అట్టహాసంగా ప్రారంభించారు. ఆరంభషో అదిరింది.

ఆకట్టుకున్న ఈవెంట్లు..

- నిట్‌లోని ఏక్ భారత్ శ్రేష్ఠక్లబ్ ఆధ్వర్యంలో నిర్వహించిన కూచిపూడి నృత్యం ఆహూతలను అలరించింది. ప్రముఖ కూచిపూడి నర్తకి తాడూరి రేణుక తన శిష్య బృందంతో కూచిపూడి నృత్యాలు ప్రదర్శించారు.
- యూత్ రెడ్‌క్రాస్ క్లబ్ ఆధ్వర్యంలో నిర్వహించిన ఈ మేళాలో వివిధ రకాలైన క్రీడలు నిర్వహిస్తారు. ఆసక్తిగల వారు మేళాలో నిర్వహించే అన్ని రకాల క్రీడల్లో ప్రతిభ కనబర్చాలి. వారి ప్రతిభ ఆధారంగా వారికి పాయింట్లు ఇస్తారు. అలాగే స్ప్రింగ్ స్ప్రీ కార్యక్రమంలో భాగంగా నిట్ యానిమీ అండ్ కామిక్ క్లబ్ ఆధ్వర్యంలో యానిమీ షోలు ప్రదర్శించారు.
- ఆరోహన్ క్లబ్ ఆధ్వర్యంలో నిర్వహించిన నుక్కడ్ నాటక్ అనే ప్రత్యేక నృత్య ప్రదర్శన ఆలోచింపజేసింది. సమాజంలో జరుగుతున్న వివిధ రకాల రుగ్మతల పట్ల సమాజం స్పందించాల్సిన తీరును కళ్లకు కట్టినట్లు ప్రదర్శించిన విద్యార్థులు ఆహూతుల ప్రసంశలు అందుకున్నారు.
- అన్ సాల్వ్‌డ్ పేరుతో నిట్‌లోని లిటరసీ అండ్ డిబేట్ క్లబ్ ఆధ్వర్యంలో నిర్వహించిన ఆట గమ్మత్తుగా ఉండటంతోపాటు థ్రిల్లర్ సినిమాను తలపించింది. అనేక రకాల ప్రశ్నల నుంచి ఆరుగురు అనుమానితుల నుంచి అంశం. సాంకేతిక పరిజ్ఞానాన్ని వినియోగించి హంతకులను గుర్తించడం ఈ ఆటలో ప్రధాన అంశం.
- ఇంటర్నేషనల్ స్టూడెంట్స్ అఫైర్స్ క్లబ్ ఆధ్వర్యంలో నిర్వహించిన ఇట్ వరంగల్ గాట్ టాలెంటెడ్ కార్యక్రమం అద్భుతంగా సాగింది. సుమారు 100 మంది విద్యార్థులు ఈ షోలో పాల్గొని వారి కళలను ప్రదర్శించి వీక్షకుల ప్రశంసలు పొందారు. అలాగే మ్యూజిక్ క్లబ్ ఆధ్వర్యంలో నిర్వహించిన గానలహరి కరౌకే టెక్నోక్రాట్‌లకు కిర్రాక్ లేపింది. ఆసక్తి ఉన్నవారు తమ గాత్రాన్ని పరిచయం చేసుకుని శ్రోతలను మెప్పించాల్సి ఉంటుంది.
- ఆరోహన్ క్లబ్ ఆధ్వర్యంలో సాంస్కృతిక సంబరంలో డ్రామా కాంపిటేషన్‌తో పాటు డ్రామా యాక్షన్ సన్నివేశాలను ఆవిష్కరించారు. వేషాలు, వేషధారణలు లేకుండా విద్యార్థులు వివిధ రకాల పాత్రలను పండించారు. విషాదాలు, విచిత్రాలు, హాస్యాలు, హాహాకారాలు ఇలా అనేక రకాలైన పాత్రలను విద్యార్థులు అవలీలగా పోషించారు.
- ఫిల్మ్ అండ్ మ్యూజిక్ క్లబ్ ఆధ్వర్యంలో నిర్వహించిన గ్రాఫిక్ డిజైన్‌పై నిర్వహించిన వర్క్‌షాప్‌లో ఛాయ్ బిస్కెట్ సినిమా ఎడిటర్ డ్రాంప్ కిరణ్ పాల్గొని విద్యార్థులకు మెళకువలు నేర్పించారు. అనంతరం ఫిల్మ్ క్విజ్ నిర్వహించారు.
- డ్యాన్స్ అండ్ డ్రమెటిక్స్ క్లబ్ ఆధ్వర్యంలో ఆన్‌లైన్‌లో నిర్వహించిన రీల్‌రీల్ రెవ్లట్‌లో ఆన్‌లైన్‌లో దేశంలోని వివిధ ప్రాంతాల్లోని ఆసక్తి గల విద్యార్థులు పాల్గొని వారు చేసిన రీల్స్‌ను ఆన్‌లైన్‌లోనే ప్రదర్శించారు.
- ఫుడ్ హంట్ ఆహూతుల నోరూరించింది. నిట్‌లోని వివిధ ప్రాంతాలకు చెందిన విద్యార్థులు వారి ప్రాంతాలకు చెందిన శాఖాహార, మాంసాహార ప్రత్యేక పదార్థాలను ప్రదర్శించారు.



సంస్కృతి, సాంకేతికత సమ్మిళితంతో సరికొత్త ఆవిష్కరణలు

వరంగల్ నిట్ డైరెక్టర్ ప్రొఫెసర్ విద్యాదర్ సుబుధి

సంస్కృతి, సాంకేతికత సమ్మేళితంతోనే సరికొత్త సృజన ఆవిష్కృతమవుతుందని వరంగల్ నిట్ డైరెక్టర్ ప్రొఫెసర్ విద్యాదర్ సుబుధి అన్నారు. శుక్రవారం స్ప్రింగ్ స్ప్రీ వేడుకలను నిట్ ఆడిటోరియంలో జరిగిన ప్రారంభ కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా హాజరైన ఆయన సంస్కృతి, సాంకేతికత ఈ రెండు వేర్వేరు అయినా వీటి మధ్య అంతఃసూత్రం ఉందన్నారు. నిత్యం పుస్తకాలతో కుస్తీపట్టే విద్యార్థులు మానసికోల్లాసానికి, తమలోని సృజనకు పదునుపెట్టడానికి ఇలాంటి సాంస్కృతిక కార్యక్రమాల్లో తరుచూ పాల్గొనాలని సూచించారు. కార్యక్రమంలో స్టూడెంట్ వెల్ఫేర్ డీన్ ప్రొఫెసర్ శ్రీనివాసాచార్య, స్టూడెంట్ ఆక్టివిటీ కౌన్సిల్ ప్రెసిడెంట్ ప్రొఫెసర్ హరికృష్ణ, నిట్ కల్చలర్ సొసైటీ వైస్ ప్రెసిడెంట్ ప్రొఫెసర్ బి.సంతోష్ బెన్ తదితరులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా విద్యార్థులు ప్రదర్శించిన సాంస్కృతిక ప్రదర్శనలు అలరించాయి.



దుమ్మురేపిన ప్రోషో..

వసంతోత్సవంలో మొదటి రోజు ప్రోషో దుమ్మురేపింది. ప్రముఖ గాయకుడు హరిచరణ్ బ్యాండ్ షోతో విద్యార్థుల్లో ఉత్సాహాన్ని నింపారు. హరిచరణ్ పాటలు పాడుతున్నంత సేపు స్టేడియం మొత్తం కోలాహలంగా మారింది. అనంతరం మరో ప్రముఖ సింగర్ శిరిష తన గానంతో భావి భారత ఇంజనీర్లను సంభ్రమాశ్చర్యాల్లో ముంచి తేల్చారు. చౌరస్తా బ్యాండ్ షోతో టెక్నోక్రాట్స్ ఉర్రూతలూగారు. ఇద్దరు గాయకులు పాటలు పాడుతున్నంత సేపు స్టేడియంలో పూనకాలు లోడయ్యాయి. చరణ్, శిరీష వారి తాజా హిట్లలోని కొన్ని పాటలను పాడి వసంతోత్సవంలో సందడి చేశారు. ఈ కార్యక్రమంలో ఆద్యంతం నిట్ డైరెక్టర్ ప్రొఫెసర్ బిద్యాధర్ - జ్యోత్స్నారాణి సుబుద్ధి దంపతులు పాలుపంచుకున్నారు.

స్ప్రింగ్ స్ప్రీలో నేటి కార్యక్రమాలు ఇవే..

రెండోరోజైన శనివారం.. సోలో ఐడల్, డైరెక్టర్స్ కట్, ఫిల్మ్ క్విజ్, హంగ్ గేమ్స్, ఫొటో పజిల్‌తో పాటు నకాష్ అజీజ్, లాహోర్ ద బ్లాక్ స్మిత్ బృందం ప్రోషోలు జరగనున్నాయి.

శ్రీహరిని కలిసిన కార్పొరేటర్లు

హనుమకొండ సిటీ, ఏప్రిల్ 5 : స్టేషన్ ఘన్‌పూర్ ఎమ్మెల్యే కడియం శ్రీహరి, వరంగల్ లోకసభ కాంగ్రెస్ అభ్యర్థి డాక్టర్ కావ్యను వర్ధన్నపేట నియోజకవర్గ పరిధిలోని పలువురు కార్పొరేటర్లు మర్యాదపూర్వకంగా కలిశారు. శుక్రవారం హనుమకొండలోని కడియం శ్రీహరి నివాసంలో కలిసి పుష్పగుచ్ఛాలు అందచేశారు. కావ్యకు అభినందనలు తెలియచేశారు. ఈ కార్యక్రమంలో కార్పొరేటర్లు ఆవాల రాధికరెడ్డి, సిరంగి సునీల్‌కుమార్, జక్కుల రజిత వెంకటేశ్వర్లు, జన్ను శిభిరాణి అనిల్, ఈదురు అరుణ విక్టర్ తదితరులు పాల్గొన్నారు.

డిగ్రీ మొదటి, మూడు, ఐదో సెమిస్టర్ ఫలితాల విడుదల

కేయూ క్యాంపస్, ఏప్రిల్ 5 : కాకతీయ యూనివర్సిటీ పరిధిలోని డిగ్రీ కోర్సులమొదటి, మూడు, ఐదో సెమిస్టర్ పరీక్షల ఫలితాలను శుక్రవారం వీసీ రమేశ్, రిజిస్ట్రార్ మల్లారెడ్డి, పరీక్షల నియంత్రణాధికారి శ్రీరామోజు నరసింహచారి, ఎస్డీఎల్‌సీఈ డైరెక్టర్ వల్లూరి రామచంద్రం, అదనపు పరీక్షల నియంత్రణాధికారి తిరుమలాదేవి విడుదల చేశారు. బీఏ, బీకాం, బీఎస్సీ, బీబీఏ, బీఏ వొకేషనల్ తదితర కోర్సుల ఫలితాలను వెల్లడించారు. మొదటి సెమిస్టర్‌లో 24.41 శాతం ఉత్తీర్ణత సాధించగా, మూడో సెమిస్టర్‌లో 30 శాతం, ఐదో సెమిస్టర్‌లో 44.45 శాతం మంది విద్యార్థులు ఉత్తీర్ణత సాధించినట్లు పరీక్షల నియంత్రణాధికారులు వెల్లడించారు. ఫలితాల కోసం వర్సిటీ వెబ్‌సైట్ https://kakatiya.a c.in/లో సంప్రదించాలని కోరారు. ఫలితాల విడుదల కార్యక్రమంలో కేయూ అదనపు పరీక్షల నియంత్రణాధికారి చాడ రాధికారెడ్డి, క్యాంపు ఆఫీసర్ ఆసీం ఇక్బాల్, నాయకపు సమ్మయ్య పాల్గొన్నారు.

రేపు మోడల్ స్కూళ్లలో ప్రవేశాలకు పరీక్ష

హాజరు కానున్న 1,253 మంది విద్యార్థులు

జనగామ కల్చరల్, ఏప్రిల్ 5: జిల్లాలోని మోడల్ స్కూళ్లలో ప్రవేశాలకు ఈ నెల 7న ప్రవేశ పరీక్ష నిర్వహించడానికి అధికారులు ఏర్పాట్లు పూర్తి చేశారు. జిల్లా వ్యాప్తంగా 8 మోడల్ స్కూళ్లు ఉండగా వాటిలో 6వ తరగతిలో 800 సీట్ల భర్తీకి, 7 నుంచి 9వ తరగతిలో మిగిలిపోయిన సీట్ల భర్తీకి ప్రవేశ పరీక్ష నిర్వహించనున్నారు. ఈ మేరకు శుక్రవారం పరీక్షా కేంద్రాల చీఫ్ సూపరింటెండెంట్లు, డిపార్ట్‌మెంటల్ అధికారులతో డీఈఓ కె.రాము జూమ్ వేదికగా అవగాహన కల్పించారు. పరీక్షా కేంద్రాల్లో అన్ని సౌకర్యాలు కల్పించామని తెలిపారు. పరీక్షా కేంద్రాల సమీపం లోని జిరాక్స్ సెంటర్లు, ఇంటర్నెట్ కేంద్రాలు మూసి ఉంచాలని యాజమాన్యాలకు ఆదేశాలు జారీ చేశారు. సిబ్బంది తో పాటు విద్యార్థులు మొబైల్ ఫోన్లను పరీక్షా కేంద్రాలకు తీసుకురావద్దన్నారు.

ప్రతీ మోడల్ స్కూల్‌లో 6వ తరగతిలో 100 సీట్లు ఉంటాయి. 8 మోడల్ స్కూళ్లలో 800 సీట్లకు గాను 783 మంది దరఖాస్తు చేసుకోగా 7 నుంచి 9వ తరగతిలో మిగిలిపోయిన సీట్ల భర్తీకి 470 మందితో మొత్తం 1253 మంది విద్యార్థులు దరఖాస్తు చేసుకున్నట్లు అధికారులు తెలిపారు.

ఆరో తరగతిలో ప్రవేశాలకు ఈ నెల 7వ తేదీ ఆదివారం ఉదయం 10 గంటల నుంచి మధ్యాహ్నం 12 గంటల వరకు ప్రవేశ పరీక్ష నిర్వహించనుండగా 7 నుంచి 9వ తరగతిలో ప్రవేశాలకు మధ్యాహ్నం 2 గంటల నుంచి సాయంత్రం 4 గంటల వరకు నిర్వహించనున్నారు. విద్యార్థులను ఒక గంట ముందు నుంచే పరీక్షా కేంద్రంలోకి అనుమతిస్తామని అధికారులు తెలిపారు.

ప్రవేశ పరీక్షకు గాను జిల్లాలోని తెలంగాణ రాష్ట్ర మోడల్ స్కూళ్లలోనే పరీక్షా కేంద్రాలు ఏర్పాటు చేశారు. జఫర్‌గఢ్, ఘన్‌పూర్‌స్టేషన్, వెల్ది, కొడకండ్ల, లింగాలఘణపురం, చౌడారం, నర్మెట, బచ్చన్నపేట మోడల్ స్కూళ్లలో పరీక్షలు నిర్వహిస్తారు. పరీక్షల నిర్వహణకు సంబంధించి ఏవైనా వివరాలకు ఏసీజీ టి.రవికుమార్ ను 99895 44981 నంబరులో సంప్రదించాలన్నారు.

ఆలయాల్లో ప్రభుత్వ ప్రత్యేక కార్యదర్శి పూజలు



వల్మిడి సీతారాంచంద్రస్వామి ఆలయంలో పూజలు చేస్తున్న శశాంక్ గోయల్

పాలకుర్తి, ఏప్రిల్ 5: శ్రీ సోమేశ్వరలక్ష్మీనర్సింహస్వామి ఆలయంలో శుక్రవారం రాష్ట్ర ప్రభుత్వ స్పెషల్ చీఫ్ సెక్రటరీ, డాక్టర్ మర్రి చెన్నారెడ్డి మానవ వనరుల అభివృద్ధి సంస్థ డైరెక్టర్ జనరల్ శశాంక్ గోయల్ శుక్రవారం సందర్శంచి ప్రత్యేక పూజలు చేశారు. ఈ సందర్భంగా ఆలయ పూజారులు స్వామి వారి శేష వస్త్రాలతో సన్మానం చేసి ప్రసాదాన్ని అందించారు. అనంతరం మండంలోని వల్మిడి దేవస్థానంలోని శ్రీ సీతా రామచంద్రస్వామి ఆలయంలో శశాంక్ గోయల్ పూజలు చేశారు. ఆయన వెంట అదనపు కలెక్టర్ పింకేష్‌కుమార్ పర్మార్, ఆలయ ఈవో లక్ష్మీప్రసన్న, అర్చకులు డీ.వీ.ఆర్ శర్మ, నాగరాజు, అనిల్ తదితరులు పాల్గొన్నారు.

ఫంక్షన్ హాళ్లలో కెమెరాల చోరీ.. కేసు నమోదు

జనగామ, ఏప్రిల్ 5 (ఆంధ్రజ్యోతి): జిల్లాలో పలుచోట్ల గురువారం ఫొటోగ్రాఫర్ల కెమెరాలను కొందరు అపహరించారు. జిల్లాకేంద్రంలోని సాయిరాం కన్వెన్షన్, పెంబర్తిలోని బీఎంఆర్, శివమ్ గార్డెన్స్‌లో జరిగిన పెళ్లిళ్లకు ఫొటోగ్రాఫర్‌లు హాజరయ్యారు. వారు ఫొటోల తంతులో బిజీగా ఉండగా గుర్తు తెలియని వ్యక్తులు డ్రోన్ కెమెరా, కెమెరాలు ఎత్తుకెళ్లారు. జిల్లాకేంద్రంలోని సాయిరాం కన్వెన్షన్ హాల్‌లో ఆలేరుకు చెందిన ఫొటోగ్రాఫర్ రాయపురం శ్రీనివాస్‌కు చెందిన రూ. 1.80 లక్షల విలువైన డ్రోన్ ఎత్తుకెళ్లారు. అదే విధంగా పెంబర్తిలో బీఎంఆర్ గార్డెన్స్‌లో జనగామ ఫొటోగ్రాఫర్ అక్షయ్‌కు చెందిన రూ.20 వేల విలువైన కెమెరా లెన్స్‌ను ఎత్తుకెళ్లారు. దీంతో పాటు పెంబర్తి శివమ్ గార్డెన్స్‌లో జనగామ ఫొటోగ్రాఫర్ కొంగరి పర్శరాములకు చెందిన రూ.2.50 లక్షల విలువైన 5డి కెమెరా సెట్‌ను దొంగలు ఎత్తుకెళ్లారు. ఒకే రోజు మూడు ఫంక్షన్‌హాళ్లలో రూ.4.50 లక్షల విలువైన కెమెరాలు ఎత్తుకెళ్లారు. యాదాద్రి జిల్లా రాయగిరి ఫంక్షన్‌హాల్‌లోనూ డ్రోన్ కెమెరా అపహరించగా సీసీ కెమెరాలో దొంగతనం రికార్డ్ అయింది. ఒకే వ్యక్తి ఈ దొంగతనాలను చేసి ఉంటాడని ఫొటోగ్రాఫర్లు అనుమానిస్తున్నారు. ఈ ఘటనపై బాధితులు ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసినట్లు సీఐ రఘుపతిరెడ్డి తెలిపారు.



జనగామలో జగ్జీవన్ రామ్‌కు నివాళులర్పిస్తున్న కాంగ్రెస్ నాయకులు



స్టేషన్ ఘన్‌పూర్‌లో రాజకీయ, దళిత సంఘాల నాయకుల నివాళి



స్టేషన్ ఘన్‌పూర్‌లో దళితుల అభివృద్ధి సంఘం నాయకుల నివాళి

మాజీ ఉప ప్రధాని జగ్జీవన్‌రామ్‌కు జన నివాళి

జనగామ కల్చరల్, ఏప్రిల్ 5: భారత మాజీ ఉప ప్రధాని బాబూ జగ్జీవన్ రామ్ 116వ జయంతిని పురస్కరించుకొని శుక్రవారం జిల్లా వ్యాప్తంగా నివాళులర్పించారు. జిల్లా కేంద్రంలోని ఆయన చిత్ర పటానికి పూలమాల వేసి నివాళులర్పించారు. కార్యక్రమంలో పీసీసీ సభ్యులు శ్రీనివాస్‌రెడ్డి, మునిసిపల్ ఫ్లోర్ లీడర్ వంగాల కళ్యాణి, పీఏసీఎస్ డైరెక్టర్ వంగాల మల్లారెడ్డి, పట్టణ పార్టీ అధ్యక్షుడు చెంచారపు బుచ్చిరెడ్డి, రామచంద్రం, బనుక శివరాజు, బడికె ఇందిర, లింగాల నర్సిరెడ్డి, నూకల బాల్‌రెడ్డి, గంగం నర్సింహారెడ్డి, మేడ శ్రీనివాస్, ఆలేటి సిద్దిరాములు, నర్సింగరావు, మల్లేశం పాల్గొన్నారు.

ఎమ్మార్పీఎస్ జిల్లా అధ్యక్షులు పైసా రాజశేఖర్, గద్దల కిషోర్, బొట్ల మహేష్, సందెన రవీందర్, శ్రావణ్, సోమరాజు, రవి నివాళి అర్పించారు.

జిల్లా కేంద్రంలోని గీతాశ్రమంలో వీహెచ్‌పీ ఆలిండియా జనరల్ సెక్రటరీ వినాయకరావు దేశ్ పాండే నివాళి అర్పించారు. కార్యక్రమంలో గుజ్జుల కుమారస్వామి, మంచాల రవీందర్, తోట భాను, పండరినాథ్, ధనుంజయ్, రంగా నరసింహారావు, గోనెల రమేష్, గునిగంటి రామకృష్ణ, సదానందచారి, సత్యం తదితరులు పాల్గొన్నారు. కరెన్సీపై అంబేద్కర్ ఫొటో సాధన సమితి జాతీయ అధ్యక్షుడు జేరిపోతుల పరశురామ్ నివాళులర్పించారు.

దళిత నాయకులు సీహెచ్.రాజమౌళి, అంబేద్కర్ యువజన సంఘం జిల్లా అధ్యక్షుడు కన్నారపు శివశంకర్, కాసాని ఉపేందర్, మాచర్ల ఆశీష్, పీఎస్. మచ్చ కుమార్, కమలాకర్ జగ్జీవన్ రామ్ విగ్రహానికి పూలమాల వేసి శ్రద్ధాంజలి ఘటించారు.

స్టేషన్‌ఘన్‌పూర్: తాటికొండ గ్రామంలో జగ్జీవన్‌రాం విగ్రహానికి జడ్పీటీసీ మారపాక రవి పూలమాల వేసి నివాళ్లు అర్పించారు. కార్యక్రమంలో మారపాక నాగరాజు, రాంచందర్ పాల్గొన్నారు.

రఘునాథపల్లి: ఖిలాషాపూర్ గ్రామంలో జగ్జీవన్ రామ్ విగ్రహనికి పలువురు పూలమాలలు వేసి నివాళులర్పించారు. కార్యక్రమంలో భవన నిర్మాణ రంగాల కార్మిక సంఘం రాష్ట్ర నాయకులు రాసమల్ల కొంరయ్య, కొమ్మగల్ల కృష్ణ, ఎంఎస్‌పి నాయకులు దర్శనాల రవి, జేరిపోతుల సుధాకర్, కాంగ్రెస్ నాయకులు మేకల నరేందర్, కోళ్ల రవి తదితరులు పాల్గొన్నారు.

జఫర్‌గఢ్: జఫర్‌గఢ్‌తో పాటు కూనూరు, తదితర గ్రామాల్లో దళిత, బీసీ సంఘాల నేతలు, ప్రజలు జగ్జీవన్‌రాం చిత్ర పటానికి పూలమాలలు వేసి ఘన నివాళులు అర్పించారు. అనంతరం పేదలకు పండ్లు పంపిణీ చేశారు. ఈ కార్యక్రమాల్లో ఎంపీటీసీల ఫోరం జిల్లా అధ్యక్షుడు ఎడ్ల వెంకటస్వామి, మాజీ ఎంపీటీసీ తాటికాయల ఎల్లయ్య, కూనూరు మాజీ సర్పంచ్ ఇల్లందుల కుమార్, గౌడ సంఘం మండల ప్రతినిధి కోరుకొప్పుల నాగేశ్ గౌడ్, అంబేద్కర్ యూత్ అధ్యక్షుడు ఇల్లందుల బాబు, దళిత, బీసీ సంఘాల ప్రతినిధులు దాట్ల అశోక్, మూల మహేశ్, తీగారపు బుచ్చయ్య, కొమురయ్య, గాదరి బాబు, కుక్కల ఎల్లయ్య, ఇల్లందుల మొగిలి, నంచర్ల యాదగిరి, కన్న సోమశేఖర్, మంచాల అనిల్, ఎడ్ల తిమోతి, కైరిక మల్లయ్య, తాటికాయల నర్సింగం, టి.యాదగిరి, తదితరులు పాల్గొన్నారు.

కొడకండ్ల: రామవరం గ్రామంలో కాంగ్రెస్ పార్టీ మండల అధ్యక్షుడు డి.సురేష్ నాయక్ ఆధ్వర్యంలో .బాబూ జగ్జీవన్‌రామ్ జయంతి వేడుకలను ఘనంగా నిర్వహించారు. కార్యక్రమంలో సోమనర్సయ్య, రాజేష్ నాయక్, ఉప్పలయ్య, రవీందర్, యాకేష్, నక్కసారయ్య, బత్తుల వెంకన్న, మహేందర్, నాగరాజు, వీర్యానాయక్ పాల్గొన్నారు.

స్టేషన్‌ఘన్‌పూర్ టౌన్: కార్మికులు, పేదలు, దళితుల సంక్షేమానికి అహర్నిషలు కృషి చేసిన దేశ మాజీ ఉప ప్రధాని బాబూ జగ్జీవన్ రామ్ ఆశయాల సాధనకు కృషి చేయాలని జగ్జీవన్ రామ్ దళితుల అభివృద్ధి సంఘం రాష్ట్ర అధ్యక్షుడు కలకోల యాదగిరి పిలుపునిచ్చారు. జయంతి సందర్భంగా శుక్రవారం స్టేషన్ ఘన్‌పూర్‌లో ఎంపీడీవో ఆఫీసు ఎదురుగా ఉన్న జగ్జీవన్ రామ్ విగ్రహానికి పూలమాలలు వేసి నివాళులు అర్పించారు. కార్యక్రమంలో చింత ఎల్లయ్య, టి.యాదగిరి, దండోరా, అంబేద్కర్, దళిత సంఘాల, కాంగ్రెస్, బీఎస్పీ, జనసేన నాయకులు ఎస్.వెంకటయ్య, గాదె పృథ్వీ, గాదె శ్రీధర్, శ్యామ్, టి.రాజయ్య తదితరులు పాల్గొన్నారు.

పాలకుర్తి: కాంగ్రెస్ పార్టీ కార్యాలయంలో బ్లాక్ కాంగ్రెస్ అధ్యక్షుడు రాపాక సత్యనారాయణ, పార్టీ నాయకులు తిరుపతిరెడ్డి, కారుపోతుల శ్రీనివాస్, గాదెపాక భాస్కర్, మహేందర్, సుధాకర్‌రెడ్డి, భాస్కర్ తదితరులు జగ్జీవన్ చిత్రపటానికి పూలమాల వేసి నివాళ్లర్పించారు.

లింగాలఘణపురం: నెల్లుట్లలో ఎంఆర్‌పీఎస్ ఆధ్వర్యంలో జగ్జీవన్ రామ్ చిత్రపటానికి పూలమల వేసి నివాళులు అర్పించారు. కార్యక్రమంలో నాయకులు రాగల్ల ఉపేందర్, నల్ల లాజర్, సందెన రవీందర్, నర్సింగ రవి తదితరులు పాల్గొన్నారు.

దేవరుప్పుల: తహసీల్దార్ కార్యాలయంలో బాబు జగ్జీవన్ రామ్ చిత్ర పటానికి ఆర్ఐ పూలమాల వేసి నివాళులర్పించారు. తన జీవితాన్ని జనం కోసమే అంకితం చేసిన మహనీయుడి జయంతిని ప్రతీ ఒక్కరూ పండుగలా చేసుకోవాలన్నారు. కార్యక్రమంలో ఆర్ఐ ఆంధ్రయ్య, సిబ్బంది యాకయ్య, చెంద్రయ్య తదితరులు పాల్గొన్నారు.

నర్మెట: మచ్చుపహాడ్ గ్రామంలో జగ్జీవన్‌రామ్ యూత్, ఎమ్మార్పీఎస్, ఎస్సీ, ఎస్టీ, బీసీ మైనారిటీలు. వికాలంగుల సంఘం ఆధ్వర్యంలో బాబు జగ్జీవన్‌రామ్ జయంతిని నిర్వహించారు. దేశాభివృద్ధికి ఎన్నో ప్రయోజనాత్మకమైన కార్యక్రమాలు చేపట్టిన మహనీయుడు జగ్జీవన్‌రామ్ అని కొనియాడారు. కార్యక్రమంలో యువజన సంఘాల సభ్యులు పాల్గొన్నారు.

బచ్చన్నపేట: మండలకేంద్రంలో బాబూ జగ్జీవన్‌రామ్ చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులు అర్పించారు. నేటి యువతరం బాబూ ఆడుగుజాడల్లో నడవాలని ఆకాంక్షించారు. కార్యక్రమంలో కంతిరి సత్తయ్య, మల్యాల బాల్‌నర్సయ్య, గంధమాల ఇస్తారి, తేలుకంటి శ్రీనివాస్, పైసా రాజశేఖర్, తమ్మడి మహేందర్, మంచాల శ్రీధర్, అల్వాల ఎల్లయ్య, బల్లెపు యాదగిరి, అజయ్, బిక్షపతి, రాజు, శ్రీనివాస్ తదితరులు పాల్గొన్నారు.



జనగామలో అంబేద్కర్ యువజన సంఘం నివాళి




జనగామలో జేరిపోతుల పరశురామ్, ఖిలాషాపూర్‌లో బీఎన్‌ఆర్‌కేఎస్ రాష్ట్ర నాయకుడు కొంరయ్య నివాళి



పాలకుర్తిలో కాంగ్రెస్ నాయకుల నివాళి



నెల్లుట్లలో జగ్జీవన్ రామ్ చిత్రపటం వద్ద నివాళి అర్పిస్తున్న ఎమ్మార్పీఎస్ నాయకులు



బచ్చన్నపేటలో బాబూ జగ్జీవన్‌రావు జయంతి వేడుకలు



రామవరంలో కాంగ్రెస్ నాయకుల నివాళి

కడియం రాకతో కాంగ్రెస్‌లో నూతనోత్తేజం

బ్లాక్ కాంగ్రెస్ అధ్యక్షుడు నాగరబోయిన శ్రీరాములు

స్టేషన్‌ఘన్‌పూర్, ఏప్రిల్ 5: స్టేషన్‌ఘన్‌పూర్ ఎమ్మెల్యే కడియం శ్రీహరి కాంగ్రెస్ పార్టీలోకి రావడంతో పార్టీలో నూతనోత్తేజం సంతరించుకుందని స్టేషన్‌ఘన్‌పూర్ నియోజకవర్గ బ్లాక్ కాంగ్రెస్ అధ్యక్షుడు నాగరబోయిన శ్రీరాములు అన్నారు. శుక్రవారం ఆయన ఆధ్వర్యంలో గ్రామానికి చెందిన 200మంది నాయకులు ఎమ్మెల్యే కడియం శ్రీహరిని, వరంగల్ పార్లమెంట్ కాంగ్రెస్ అభ్యర్థిగా ఎంపికైన కడియం కావ్యలను హన్మకొండలోని వారి నివాసంలో మర్యాదపూర్వకంగా కలిసి పుష్పగుచ్చం అందించి శుభాకాంక్షలు తెలిపారు. ఈ సందర్భంగా కడియం కావ్య గెలుపుకోసం కలిసికట్టుగా కష్టపడి పనిచేయాలని కోరినట్లు తెలిపారు. కడియంను కలిసిన వారిలో పార్టీ గ్రామశాఖ అధ్యక్షుడు ఏదునూరి రాజు, నూదుల రత్నాకర్ రెడ్డి, నరహరి, రామరాజు, పొన్నం పారిజాత, జోగు రాజమ్మ, శ్యామల, కావటి తిరుమల, గాదెరి లక్ష్మి, ప్రేమ, గుర్రం ప్రశాంత్, జోగు రాజేష్ ఉన్నారు.

కడియం వెళ్లిపోతే వచ్చే నష్టమేమీ లేదు

బీఆర్ఎస్ నాయకుడు అక్కెనపల్లి బాలరాజు

స్టేషన్‌ఘన్‌పూర్, ఏప్రిల్ 5: స్టేషన్‌ఘన్‌పూర్ ఎమ్మెల్యే కడియం శ్రీహరి కాంగ్రెస్‌లో చేరినంత మాత్రాన పార్టీకి వచ్చే నష్టమేమీ లేదని బీఆర్ఎస్ జిల్లా నాయకుడు, మార్కెట్ కమిటీ మాజీ చైర్మన్ అక్కెనపల్లి బాలరాజు అన్నారు. శుక్రవారం తాటికొండ గ్రామంలో ఏర్పాటు చేసిన సమావేశంలో ఆయన మాట్లాడారు. గ్రామాల్లో బీఆర్ఎస్ పార్టీ పటిష్టంగా ఉందన్నారు. పార్లమెంట్ ఎన్నికల్లో బీఆర్ఎస్ సత్తా చాటాలని కార్యకర్తలను కోరారు. స్థానిక సంస్థల ఎన్నికల్లో మెజార్టీ స్థానాలు బీఆర్ఎస్ అభ్యర్థులు గెలుస్తారని తెలిపారు. కార్యకర్తలు అధైర్యపడవద్దని ఆపదలో జనగామ ఎమ్మెల్యే పల్లా రాజేశ్వర్‌రెడ్డి అండగా ఉంటారని అన్నారు. కార్యక్రమంలో పార్టీ నాయకులు పొన్నం శ్రీనివాస్‌గౌడ్, నూనవత్ జైపాల్, బానోతు రవీందర్‌నాయక్, నీల కుమార్, మారపాక ప్రశాంత్, బాలునాయక్, నీల వెంకటనర్సు, నాగరాజు, జోజి, రాంచందర్, అశోక్ తదితరులు పాల్గొన్నారు.

కాంగ్రెస్ మండలాల అధ్యక్షుల నియామకం

జనగామ, ఏప్రిల్ 5 (ఆంధ్రజ్యోతి): జనగామ నియోజకవర్గంతో పాటు దేవరుప్పుల మండల కాంగ్రెస్ పార్టీ అధ్యక్షులను నియమిస్తూ టీపీసీసీ నిర్ణయం తీసుకుంది. టీపీసీసీ అధ్యక్షుడు రేవంత్‌రెడ్డి ఆదేశాల మేరకు మండల అధ్యక్షుల నియామకానికి టీపీసీసీ వర్కింగ్ ప్రెసిడెంట్ మహేశ్‌కుమార్‌గౌడ్ ఉత్తర్వులు జారీ చేశారు. జనగామ నియోజకవర్గంలోని బచ్చన్నపేట మండల అధ్యక్షుడిగా నూకల బాల్‌రెడ్డి, కొమ్ము రవి(చేర్యాల), మంచాల చిరంజీవులు(చేర్యాల టౌన్), కోల సాయిలు గౌడ్ (దూల్మిట్ట), చెంచారపు బుచ్చిరెడ్డి(జనగామ టౌన్), లింగాల నర్సిరెడ్డి (జనగామ), మహదేవుని శ్రీనివాస్(కొమురవెల్లి), మ్యాక మల్లేశం(మద్దూరు), రాజబోయిన లక్ష్మీనారాయణ (నర్మెట్ట), వగలబోయిన యాదగిరి గౌడ్ (తరిగొప్పుల), నల్ల శ్రీరాములు (దేవరుప్పుల) నియామకమయ్యారు. కొత్తగా మండల అధ్యక్షులుగా ఎన్నికైన వారికి జిల్లా అధ్యక్షుడు కొమ్మూరి ప్రతాప్‌రెడ్డి నియామక పత్రాలను అందించారు.



జనగామ పట్టణ అధ్యక్షుడు చెంచారపు బుచ్చిరెడ్డికి నియామక పత్రాన్ని అందిస్తున్న కొమ్మూరి ప్రతాప్‌రెడ్డి

జనజాతర సభను జయప్రదం చేయాలి

హైదరాబాద్ తుక్కుగూడలో టీపీసీసీ ఆధ్వర్యంలో శనివారం జరిగే తెలంగాణ జనజాతర సభను జయప్రదం చేయాలని కాంగ్రెస్ పార్టీ జిల్లా అధ్యక్షుడు కొమ్మూరి ప్రతాప్‌రెడ్డి పిలుపునిచ్చారు. జిల్లాకేంద్రంలోని కాంగ్రెస్ పార్టీ కార్యాలయంలో జనజాతర సభకు సంబంధించిన పోస్టర్లను ఆయన ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. సభకు జనగామ నియోజకవర్గంతో పాటు జిల్లాలోని అన్ని మండలాల నుంచి పెద్ద సంఖ్యలో కాంగ్రెస్ కార్యకర్తలు, విద్యార్థులు, యువత, మహిళలు, కార్మికులు, రైతులు తరలి రావాలని పిలుపునిచ్చారు. పెద్ద ఎత్తున జనసమీకరణ చేయాలని బూత్ స్థాయి ఏజెంట్లకు సూచించారు. కార్యక్రమంలో నియోజకవర్గ ఇంచార్జి భవానీరెడ్డి, నాయకులు చామల అనిల్ తదితరులు పాల్గొన్నారు.

గీత కార్మికుడికి గాయాలు

బచ్చన్నపేట, ఏప్రిల్ 5: తాటిచెట్టు ఎక్కిన గీత కార్మికుడు ప్రమాదవశాత్తు కాలుజారి కింద పడటంతో తీవ్ర గాయాలయ్యాయి. పోచన్నపేట గ్రామానికి చెందిన నర్మెట చిన్న సత్తయ్య అనే గీతకార్మికుడు ఎప్పటిలాగే శుక్రవారం తాటి చెట్టు ఎక్కగా ప్రమాదవశాత్తు అదుపు తప్పి కింద పడ్డాడు. దీంతో చెయ్యి, కాళ్లు, నడుముకు గాయాలయ్యాయి. వెంటనే అతడిని జనగామకు తరలించి అక్కడి నుండి హైదరాబాద్‌కు తీసుకెళ్లారు. కల్లుగీత కార్మిక సంఘం జిల్లా కార్యదర్శి బాల్నే వెంకటమల్లయ్య బాధితుడిని పరామర్శించి, బాధిత కార్మికున్ని ఆదుకోవాలని కోరారు.

అప్పుల బాధతో యువకుడి ఆత్మహత్య



కృష్ణ (ఫైల్)

నర్మెట, ఏప్రిల్ 5 : అప్పుల బాధతో ఓ వ్యక్తి ఆత్మహత్య చేసుకున్నాడు. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. కన్నెబోయినగూడెం గ్రామానికి చెందిన గంగరబోయిన కృష్ణ(25) సెకండ్‌హ్యాండ్ కార్ల కొనుగోలు, అమ్మకాల బిజినెస్ చేస్తూ ఆర్థికంగా నష్టపోయాడు. దీంతో మద్యానికి బానిసయ్యాడు. పలుమార్లు భార్య రవళితో గొడవలు జరిగాయి. ఈనెల 2 తేదిన కూడా అప్పుల విషయంలో భార్యభర్తలకు గొడవ జరిగింది. దీంతో మనస్తాపం చెందిన కృష్ణ గురువారం నాడు పురుగుల మందు తాగాడు. వెంటనే ఆసుపత్రికి తరలించగా చికిత్స పొందుతూ శుక్రవారం మృతి చెందాడు. ఆయనకు భార్యతో పాటు ఇద్దరు కుమారులు ఉన్నారు. ఎస్సై శ్రీకాంత్ కేసు దర్యాప్తు చేస్తున్నారు.

బ్రెయిన్ స్ట్రోక్‌తో బీఆర్ఎస్ నాయకుడి కన్నుమూత

చిలుపూర్, ఏప్రిల్ 5 : మండలంలోని వెంకటాద్రిపేటకు చెందిన బీఆర్ఎస్ నాయకుడు, గ్రామశాఖ మాజీ అధ్యక్షుడు గాదె జయపాల్‌రెడ్డి (58) బ్రెయిన్ స్ట్రోక్ కారణంగా శుక్రవారం మృతిచెందాడు. రెండు రోజుల క్రితం అనారోగ్యానికి గురైన జయపాల్‌రెడ్డిని హైదరాబాద్‌లోని ఓ ప్రైవేటు ఆస్పత్రికి తరలించగా చికిత్స పొందుతూ బ్రెయిన్ స్ట్రోక్‌కు గురై మృతిచెందాడని కుటుంబ సభ్యులు తెలిపారు. ఆయన టీఆర్ఎస్ పార్టీ ఆవిర్భావం నుంచి క్రియాశీలకంగా వ్యవహరించడంతో పాటు, ఎమ్మెల్యే కడియం శ్రీహరికి ప్రధాన అనుచరునిగా పేరుంది.

రాంగ్‌రూట్‌లో వచ్చిన డీసీఎం

బైక్ ఢీకొని ఇద్దరికి తీవ్రగాయాలు • ఒకరి పరిస్థితి విషమం

స్టేషన్‌ఘన్‌పూర్, ఏప్రిల్ 5: రాంగ్‌రూట్‌లో వస్తున్న డీసీఎం వాహనాన్ని బైక్ ఢీకొట్టిన సంఘటనలో ఇద్దరికి తీవ్రగాయాలయ్యాయి. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. వరంగల్‌కు చెందిన రామంచ జాషువా, బాబు అనే ఇద్దరు వ్యక్తులు బైక్‌పై వరంగల్ నుంచి హైదరాబాద్‌కు వైపు వెళుతుండగా రాఘవపూర్ గ్రామ శివారులో రాంగ్‌రూట్‌లో ఎదురుగా వచ్చిన డీసీఎంను ఢీకొట్టారు. దీంతో బైక్ నడుపుతున్న జాషువా ఎడమ చేతి భుజం తెగిపోయి తీవ్రంగా గాయపడగా, బాబు తలకు, చేతులకు గాయాలయ్యాయి. స్థానికులు 108 ద్వారా వరంగల్ ఎంజీఎంకు తరలించారు. కాగా జాషువా పరిస్థితి విషమంగా ఉందని కుటుంబ సభ్యులు తెలిపారు. సీఐ ముస్కు రాజు కేసు దర్యాప్తు చేస్తున్నారు.

బెల్ట్‌షాపు నిర్వాహకుడిపై కేసు

చిలుపూర్, ఏప్రిల్ 5: నష్కల్ గ్రామానికి చెందిన మానుక చంద్రయ్య తన బెల్టు షాపులో అక్రమంగా నిల్వఉంచిన రూ.4 వేల విలువ గల మద్యం బాటిళ్లను పోలీసులు శుక్రవారం సీజ్ చేశారు. ఈ మేరకు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై రాజేందర్ తెలిపారు.

రేషన్‌షాపు ఎదుట వినియోగదారుల నిరసన

చిలుపూర్, ఏప్రిల్ 5 : పల్లగుట్ట గ్రామంలోని ఓ రేషన్ షాపులో సన్న బియ్యం, మరో షాపులో దొడ్డు బియ్యం పంపిణీ చేయడం వివాదానికి దారితీసింది. దీంతో వినియోగదారులు నిరసన వ్యక్తం చేశారు. గ్రామంలో రెండు రేషన్ షాపులు ఉండగా ఒకటో నెంబర్ దుకాణానికి 550 కార్డులకు గాను సగం సన్నబియ్యం, సగం దొడ్డు బియ్యాన్ని అధికారులు కేటాయించారు. అదే గ్రామంలో మరో దుకాణానికి (2వ నంబర్) 570 కార్డులుండగా, మొత్తం దొడ్డు బియ్యాన్నే కేటాయించారు. సమాచారమందుకున్న వినియోగదారులు 2వ నెంబర్ డీలర్ జయపాల్‌రెడ్డిని సన్నబియ్యం విషయమై నిలదీయడంతో పాటు, షాపు ఎదుట నిరసన వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా డీలర్ కడారి జయపాల్ రెడ్డి మాట్లాడుతూ, తూకంలో డీలర్లకు మోసం జరుగుతోందని గతంలో అధికారులను నిలదీసిన పాపానికి ఎంఎల్ఎస్ పాయింట్ ఇన్‌చార్జి, డీటీలు తనపై కక్షతో కావాలనే ఇబ్బందులకు గురి చేస్తున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. సన్నబియ్యం, దొడ్డు బియ్యాన్ని కలిపి సమానంగా షాపులకు కేటాయించాలని అధికారులను డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో వినియోగదారులు బత్తిని వెంకటనర్సు, కుమారస్వామి, వేల్పుల రమేష్, దాసరి లక్ష్మి, భాగ్యలక్ష్మి, చంద్రయ్య, ఏసిరెడ్డి తదితరులు పాల్గొన్నారు.

బీజేవైఎం రాష్ట్ర అధికార ప్రతినిధిగా సంతోష్

జనగామ కల్చరల్, ఏప్రిల్ 5: భారతీయ జనతా యువమోర్చా రాష్ట్ర అధికార ప్రతినిధిగా చింతకింది సంతోష్ యాదవ్ నియమితులయ్యారు. ఈ మేరకు రాష్ట్ర అధ్యక్షులు చేవెళ్ల మహేందర్ శుక్రవారం ఉత్తర్వులు జారీ చేశారు. ఏబీవీపీలో 12 సంవత్సరాలుగా విద్యారంగ సమస్యల పై అనేక ఉద్యమాలు నిర్వహించడంతో పాటు క్రమశిక్షణ గల కార్యకర్తగా భావించి ఆయనకు రాష్ట్ర స్థాయి బాధ్యతలు అప్పగించినట్లు మహేందర్ తెలిపారు. ఈ సందర్భంగా సంతోష్ మాట్లాడుతూ తనపై నమ్మకంతో బాధ్యతలు అప్పగించినందున పార్టీ అభివృద్ధికి పాటుపడతానన్నారు. తన నియామకానికి సహకరించిన రాష్ట్ర అధ్యక్షులు కిషన్‌రెడ్డికి, మహేందర్‌కు, జిల్లా అధ్యక్షులు ఆరుట్ల దశమంతరెడ్డికి కృతజ్ఞతలు తెలిపారు.

తుక్కుగూడ సభను విజయవంతం చేయాలి

స్టేషన్‌ఘన్‌పూర్, ఏప్రిల్ 5: హైదరాబాద్ సమీపంలోని తుక్కుగూడలో శనివారం నిర్వహిసుతన్న జనజాతర సభకు కార్యకర్తలు పెద్ద ఎత్తున హాజరై విజయవంతం చేయాలని స్టేషన్‌ఘన్‌పూర్ ఎమ్మెల్యే కడియం శ్రీహరి పిలుపునిచ్చారు. శుక్రవారం రాత్రి కాంగ్రెస్ పార్టీ కార్యాలయంలో టీపీసీసీ రాష్ట్ర ప్రధానకార్యదర్శి సింగపురం ఇందిర అధ్యక్షతన జరిగిన సమావేశంలో ఆయన మాట్లాడారు. కాంగ్రెస్ పార్టీ ఆది నాయకత్వం హజరయ్యే సభకు నియోజకవర్గం నుంచి కార్యకర్తలు పెద్ద ఎత్తున హజరు కావాలని కోరారు.

రంగరాజు ప్రసాద్‌కు ఉగాది పురస్కారం

జనగామ కల్చరల్, ఏప్రిల్ 5: జిల్లా కేంద్రానికి చెందిన రంగరాజు ప్రసాద్ ఉగాది పురస్కారం అందుకున్నారు. శుక్రవారం సిద్దిపేటలో వెన్నెల సాహితీ సంస్థ ఆధ్వర్యంలో నిర్వహించిన ఉగాది కవి సమ్మేళనంలో 'స్వతంత్ర భారతమా ఎటు నీ పయనం' అనే అంశం పై కవితా గానం చేసినందుకు గాను 'శ్రీ వేముగంటి నరసింహాచార్యుల ఉగాది పురస్కారం' అందుకున్నారు. రంగరాజు ప్రసాద్ జనగామ సెయింట్ మేరీస్ పాఠశాలలో తెలుగు ఉపాధ్యాయుడుగా పని చేస్తున్నారు. ఈ సందర్భంగా ప్రసాద్‌ను తోటి ఉపాధ్యాయులు అభినందించారు.

బుగులు వేంకన్నకు వెండి పాదాలు

చిలుపూర్, ఏప్రిల్ 5 : చిలుపూర్ బుగులు వెంకన్నకు ఓ భక్తుడు రూ.10 వేల విలువ గల వెండిపాదాలతో పాటు, అన్నదాన నిర్వహణ కోసం మరో రూ 10 వేల నగదును అందజేశారు. హైదరాబాద్‌కు చెందిన పల్లపు శ్రీనివాస్ తన కుటుంబ సభ్యులతో కలిసి శుక్రవారం స్వామివారిని దర్శించుకుని ఆలయంలో పూజలు చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, తమ ఇంటి ఇలవేల్పు వెంకటేశ్వర స్వామిని యేటా దర్శించుకుంటామని, అందులో భాగంగానే ఈరోజు మొక్కులు సమర్పించామని అన్నారు. కార్యక్రమంలో పూజారి సౌమిత్రి రంగాచార్యులు, ఈవో లక్ష్మీప్రసన్న, ఆలయ సిబ్బంది పాల్గొన్నారు.